కథానిక:



# వ్యర్థులు

"నా చేతి కింత డబ్బెలా వచ్చిందో వాళ్ళకి అంతుపట్టకపోవటంతో ఆపూట వాళ్ళు తిన్న పదార్థాలన్నీ జీర్ణం చేసుకోవటానికి వీలుకాని గుండ్రాళ్లగాను, ఆపూట చూసిన సినిమా పీడకలగాను మారి వుంటై!"

శివయ్యలాగా, ఉన్న విషయాన్నింత దాగుణంగా చెప్పటం మంచిది కాకపోయి నప్పటికీ - ఇంతకంటె ఘను డెవ్వరూ దొరకనట్టు లక్ష్మీదేవి వీణ్ణి పట్టుకు వేళ్ళాడిందంటే - అతని మిత్రులు కొద్దిపాటి కలవరం ఇలాగే పడివుంటా రనుకుంటాను.

అసలు వాళ్ళిలా అనుకోవటం నాబోటి సామాన్యుల కేమీ ఆశ్చర్యం కలిగించకూడదుకూడాను. కాకపోతే, ఇదేవిషయం మానసికంగా మైనారిటీ వెళ్ళని చిరంజీవి మానవులకు సర్వసామాన్యమైన అర్థంలేని చిల్లరతగాదాలుగా ఏ కొద్దిమంది వేదాంతులకో కనపడనూవచ్చు. మరి కొందరు సంఘసంస్కర్తలకు ఇలాటి విషయాలన్నిటివెనక తవ్వితీసి సందుమలుపులో ఒక మహాసభను ఏర్పాటు చెయ్యతగ్గంత సాంఘికసమస్య దాగున్నట్టు కనపడనూవచ్చు. కాని, ఇవన్నీ వాస్తవికానికి నాలుగడుగులు పైన నిలబడి చేసే నేలవదలిన సామని మీ నాబోటివాళ్లం చప్పరించనూవచ్చు.

సరే - ఆరోజుల్లో శివయ్య ఎదురయాడంటే అతని స్నేహితులంతా భస్మాసుర దర్శనం అయినట్టు హడిలిపోయేవాళ్లు! మొహం చాటుచేసి సందుల్లోకి తప్పుకోవటాలు మొదలు, జేబుల్లో డబ్బులు కనపడకండా దాచుకోవటాలదాకా యథాశక్తిని పాటుపడేవాళ్ళు.

"మనవా డెక్కడా అయిపు లేడేరా, నిన్నా, ఇవాళ్లా?" అన్నాడు. విశ్వనాథం కిష్టమూర్తితో, ఫలహారం పూర్తిచేసి కాఫీవచ్చేలోపల.

"మిన్నువిరిగి మీదపడ్డంత ప్రమాదమొస్తే తప్పితే సాధారణంగా కనపడకుండా ఉండేమనిషి కాదుమరి!" అన్నాడు కిష్టమూర్తి చాలా శాక్యంగా మాట్లాడా నన్నట్టు తల ఆడిస్తూ.

ఇలా ఒక్కసారిగా శివయ్య రెండు రోజులుగా అదృశ్యం కావటంతో విశ్వనాథం, కిష్టమూర్తి మొదలైన మిత్రబృందం ఒకవిధంగా నిరాశపొందారు. మరీ అంత తెగబడి అనటం సాహసమేమోకాని - శివయ్యమాత్రం ఇప్పటికి అంటూఉంటాడు .. తనకు డబ్బులేదని వాళ్లని అప్పు అడుగుతూంటే వాళ్లొకవిధమైన సంతృప్తిపొందే వాళ్లని! దానికి నిదర్శనం తనకి డబ్బు రావటంఉదంతం అంటాడు పైగా.

రచన:

## శ్రీ వెంపటి సచ్చిదానందశర్మ

"అంతమాత్రంచేత కేవలం వాళ్లని సంతృప్తి పర్చటానికే నేను అప్పులు అడుగుతూ ఉండేవాణ్ణనుకోనవసరం లేదు" - మానవ స్వభావాన్నిలా పరమాణువులకింద తెగ నరికి పరిశోధిస్తున్నట్టు మాట్లాడేవాడు శివయ్య.

"పట్టుమని పదిరూపాయలు జేబులో వేసుకుని బజార్లోకి రావటమంటే భయంగా వుందనుకో" అన్నాడు కిష్టమూర్తి కాఫీ గ్లాసు బల్లమీద పెడుతూ.

"అబ్బాయ్! నే నొక్కసంగతి చెప్తా విను - ఖర్చులు తగ్గించుకోవటానికి వీలు లేనప్పుడు చేతనైతే నాలుగురూపాయలు సంపాదన ఎక్కువయేట్టు చూసుకోవాలి; సంపాదన ఎక్కువయేమార్గం లేకపోతే ఖర్చులు తగ్గించుకోవాలి. అంతేకాని, ఎంతకాలమని ఇట్లా...వాడిదగ్గిర ఐదూ, వీడిదగ్గిర పదీ...ఈ జరిమానాలు! ఎంత చెట్టు కంత గాలని, ఎవ డవసరాలు వాళ్లు తీర్చుకోవటానికే సతమతమౌతుంటే పై వాళ్ళకికూడా వెదజలటానికి ఎవరిదగ్గిరుంటుంది డబ్బు!"

విశ్వనాథం కొంచెం తటపటాయించి కృష్ణమూర్తివైపు ఒకసారి చూసి మళ్లీ ప్రారంభించాడు. "నువ్వూ చూస్తున్నావుగా అప్పులడగడం రూపాయల్లోనుంచి చిల్లరడబ్బుల్లోకి దిగింది! ఇంతకీ వచ్చిన తిప్పలేమిటంటే ఇలాటి విషయాల్లో కరాఖండీగా ఉండటానికి వీల్లేనంత సన్నిహిత స్నేహాలు కావటమే!"...

ఇలా విశ్వనాథం ఉపన్యాసధోరణిలో చాలాసేపు మాట్లాడినప్పటికీ తన మాటల తీరు తనకే ఏదో వెలితిగా అనిపించి బాధపడ్డాడు. ఇక్కడ కృష్ణమూర్తి, విశ్వనాథానికీ సంబంధించిన ఒక విషయం గురించి చెప్పాలి. క్రిందటినెల ఇరవయ్యో తేదీ ఆ ప్రాంతాల్లో ఏదో ప్రాణావసరం వచ్చిందని పదిరూపాయలు అప్పుతీసుకున్నాడు విశ్వనాథం కృష్ణమూర్తిదగ్గర. మరి నాలుగురోజులతరవాత కృష్ణమూర్తి పెదనాన్న రెండోకొడుకుపెళ్ళికి వెడుతూ విశ్వనాథం గడియారం ఎరువుపట్టుకెళ్లాడు. మరి, ఆ గడియారం కృష్ణమూర్తిదగ్గిరే పాడయిందో, లేక, విశ్వనాథందగ్గిరికి వచ్చినతరవాత పాడయిందో తెలీదు కాని


కాశ్మీర్
అన్నిదగ్గులకు అమోఘమైనది
గిరిజా & కో., రాజమండ్రి

దానికి కొద్దిపాటి మరమ్మత్తు అవసరం కలిగింది. అప్పటినుంచీ కృష్ణమూర్తి తను ఇచ్చిన పదిరూపాయలు తిరిగి ఇవ్వమనటానికీ, విశ్వనాథం తన గడియారం బాగు చేయించుకోవటానికైన ఖర్చు అడగటానికీ మొహం చెల్లేది కాదు; అడగకండా ఉండనూ లేకపోయేవాళ్లు. అందువల్ల అప్పటినుంచీ వాళ్లిద్దరిలో ఎవరు ఏమి మాట్లాడినా బాకీవిషయం సార్థాతికంగా స్ఫురింపజేస్తున్నాడేమో నని మనస్సులో బాధపడేవాళ్లు.

ప్రస్తుతం విశ్వనాథం అదే బాధకు లోనయాడు. కాని ఎలాగో తనని తానే సంబాళించుకుని, "ఆపైన ఏమైనాగాని, ఇహనించీ నిర్మొహమాటంగా వుండదల్చాను." మెడ బెణికేటంత విసురులో తలవూపాడు!

ఆ కీలక మేదో తనకికూడా ఉపదేశించమన్నట్లు కిష్టమూర్తి చెవులు రిక్కించి కొద్దిపాటి ఆసక్తి చూపాడుకాని, విశ్వనాథం ఎంతసేపు మాట్లాడినా వెనకటి విషయాలనే పునశ్చరణ చెయ్యటంతో అతని ఉత్సాహం దిగజారిపోయింది. ఇది గ్రహించినట్టే విశ్వనాథం "నువ్వే చూసావుగా .. ఈశివ నాదగ్గిర్నుంచి దమ్మిడీ అవతలకి కదిలితే అప్పడను. దేనికైనా హద్దూ పద్దూ అంటూ ఒకటి వుంటుంది..."


కృష్ణమూర్తి ఔననికాని, కాదనికాని ఏమీ అనలేక తనూ ప్రయత్నిస్తా నన్నట్టు తలతిప్పి ఊరుకున్నాడు.

మరి, వీళ్లింత కఠోరనిర్ణయాని కొచ్చిన తరవాత తమ మనోనిబ్బరాన్ని పరీక్షించుకోనివ్వటానికన్నా శివయ్య ఒక్కసారి అప్పు అడగకపోతే వీళ్ల కెలా వుంటుంది చెప్పండి? ఎవళ్ళనీ దమ్మిడీ అడక్కుండా తన అవసరాలన్నీ తీర్చుకోగల శ్రీమంతుడయాడు శివయ్య అని ఎవరనుకుంటారు? లేక, కోర్కెలన్నీ చంపుకుని డబ్బు అవసరమే తీరిపోయేటంత నిస్సంగుడయాడని మాత్రం ఎవరనుకుంటారు? కేవలం తన స్నేహితుల్ని అవమానపర్చాలని తప్పితే, వెక్కిరించినట్లు శివయ్య అప్పలడగటం ఎందుకు మానెయ్యాలి?

పూర్వం ఈ శివయ్య ఎక్కడ ఎదురౌతాడో నని బిక్కుబిక్కుమంటూ బజార్లోకి అడుగుపెట్టగానే గుండె గుభేలుమనేట్టు ప్రత్యక్షమయే శివయ్య మరీ నల్లపూసయిపోయాడు. పోనీ,అప్పు అడగటానికిష్టం లేకపోతే పోవచ్చు; కలిసి మాట్లాడటానికేం? స్నేహంఅంటే కేవలం డబ్బుకోసమేనా అతని ఉద్దేశం?

ఈ రెండురోజులూ ఛాతీలు విరుచుకు తిరిగారు విశ్వనాథం, కృష్ణమూర్తి...శివయ్యకి సవాలుచేస్తున్నట్టు. రూపాయలు గలగలాడించుకుంటూ శివయ్యముందు నిలబడితే తను ఆ మోతకి బెదిరి పారిపోతాడేమో ననుకున్నారువాళ్ళు అనటం అతిశయోక్తి కాదంటాడు శివయ్య!

ఇంత భావైక్యం కుదిరినట్లు కృష్ణమూర్తి, విశ్వనాథం పైకి కనిపిస్తున్నప్పటికీ—ఇంటి ఖర్చులు ఎక్కువౌతున్నాయనీ, వచ్చే జీతండబ్బులతో గిజగిజగా వుందనీ, ఈ నెల మరీ అర్ధాన్నంగా వుందనీ కృష్ణమూర్తి ఒకేవిషయాన్ని పదిసార్లు చెప్పేసరికి విశ్వనాథంమనసు పరిపరివిధాలపోయింది. తను కృష్ణమూర్తి కివ్వాల్సిన పదిరూపాయలమాట జ్ఞాపకంవచ్చింది. తన పదిరూపాయలూ తన కిమ్మని నోరార అడగలేక ఇలా అవస్థపడుతున్నాడేమో ననుకున్నాడు. ఐనా, ఈవిషయంలో తనకు తాను బయటపడకూడదనుకుని విశ్వనాథం తన జీవితంలోనుంచికూడా ఉదాహరణలను ఎత్తిచూపుతూ మధ్యతరగతి



కుటుంబాల బడాయిబ్రతుకులపైన చాలాసేపు మాట్లాడాడు!

కాని, ఆపూట ఇంటికి వెళ్లినదగ్గరనుంచీ కృష్ణమూర్తి తనకు రావలసిన పదిరూపాయలవిషయమే మాట్లాడాడని బాధపడ్డాడు విశ్వనాథం. ఇదే నిజమైతే, మరి గడియారం బాగుచేయించటానికైన ఖర్చుమాట ఎత్తితేం? కృష్ణమూర్తి కనీసం ఎంత అయిందనన్నా ఎన్నడూ అడిగిన పాపాన పోలేదు. ఆపాటి తనకు అడగటం చేత కాదనా? విశ్వనాథానికి రాత్రల్లా ఇవ్వే ఆలోచనలు. ఈవిషయంలోకూడా ముసుగులో గుద్దులాటగా కాకుండా తేల్చేసుకోవటం మంచిదనుకున్నాడు. కాని, ముందు తా నివ్వవలసిన పదిరూపాయలిచ్చేసి, తరవాత తను గడియారం బాగుచేయించటానికైన చార్జీలు పదిరూపాయల చిల్లర వసూలు చెయ్యటమో, లేక, నా పదిరూపాయలూ నాకిమ్మని అక్షరాలా కృష్ణమూర్తిచేత అడిగించుకున్నతరవాత విషయమంతా తేల్చుకోవటమో - ఈ రెంటిలో ఏదో ఒక నిర్ణయానికి రాలేక ఆలోచిస్తూనే నిద్రపోయాడు విశ్వనాథం.

తెల్లారి కృష్ణమూర్తి కూరల మార్కెట్టుకి వెడుతూ పిలవటానికి రావటంతో తనని డబ్బు అడుగుతాడన్నవిషయం స్థిరపడిపోయింది విశ్వనాథం మనస్సులో. ఖర్చులకు పోనూ, ఎటుపోయి ఎటువస్తుందోనని పదిరూపాయల నోటు జేబులో వేసుకుని బజారుబయలు దేరాడు. కాని, అవసరమైతే తప్ప తాను ముందు చెయ్యజారకూడ దనుకున్నాడు.

హోటల్లో కూర్చున్నదిమొదలు కృష్ణమూర్తి డబ్బునుగురించిన తన అవస్థ చెప్పటం మొదలుపెట్టాడు. ఆ సొద వినలేక విశ్వనాథంతల' పగిలిపోతోంది. తన జేబులో ఉన్న పదిరూపాయల కాగితాన్ని తిప్పి మొహాన కొడదామా అనిపించింది. కాని, కాస్తా కూస్తా కాదు, పదిరూపాయలు!-అనిపించింది మళ్ళీ.

కృష్ణమూర్తికూడా బయటపడి డబ్బిమ్మనటం ఎలాగో. లీక బాధపడుతున్నాడు. ఇలా ఇద్దరూ ఎవడికి వాడు గిరి గీసుక్కూర్చుని అవతలివాణ్ణి బయటికి కెపివటం ఎలాగని సతమతమౌతున్న ఈ ఘడియల్లో-అనుకోనివిషయం - శివయ్య వాళ్లముందు ప్రత్యక్షమయాడంటే అది ఎంత కలవరం కలిగించే సంఘటన చెప్పండి! ఉక్కిరిబిక్కిరయారు వాళ్లిద్దరూను. వడదెబ్బ తగిలినట్లయినై వాళ్ళ మొహాలు.

ఆ గడబిడలో శివయ్యనుగురించి వాళ్ళు తీసుకున్న నిర్ణయాలు అసలే గుర్తురాలేదు వాళ్ళకు. తన జేబులో ఉన్న పదిరూపాయల కాగితం ఎగిరి శివయ్యచేతులో పడుతున్నట్లనిపించింది విశ్వనాథానికి. క్షణం గడుస్తున్నకొద్దీ తన నోటువిలువ తగ్గిపోతున్నట్లనిపిస్తోంది. మరికొంచెంసేపు తను ఉపేక్ష వహిస్తే ఆనోటునుంచి తను చిత్తుకాగితంవిలువన్నా పొందలేనేమోనన్నంత కలవరపడ్డాడు విశ్వనాథం.

“కృష్ణమూర్తీ! ఇయగోరా! నీ పదిరూపాయలు!” అన్నాడు విశ్వనాథం ఏమైనాసరే నీఅప్పు చెల్లించితీరుతానన్నట్టు!

కృష్ణమూర్తి అంతకంటె తెలివితేటలుగా అసలేమీ ఎరగనట్టు “అరే! ఏమిటిది? పదిరూపాయలా? ఎందుకు?” అన్నాడు.

“ఎందుకేమిటిరా? ఏమీ ఎరగనట్టు మాట్లాడుతావ్! నీదగ్గర నేను పదిరూపాయలు బదులుతీసుకోలేదూ! అందుకు! ఊం.. ఇంద!” అన్నాడు విశ్వనాథం తొందరపడుతూ.

ఆ పదిరూపాయల నోటు శివయ్యపాల బడేలోపల తన కివ్వవలసిన అప్పు తీరిందనిపిద్దామని విశ్వనాథం తంటాలుపడుతున్నాడని గ్రహించి కృష్ణమూర్తి తన నోటిమీదుగా “బాకీ చెల్లు” అని అనకూడ దనుకున్నాడు! “ఎప్పటి పదిరూపాయలమాట! ఇన్నాగాని లే' వుంచరా! ఏమంత తొందర? అసలైనా ఇప్పుడు నీదగ్గరనుంచి డబ్బు కావలసికాదు ఇందాకటినుంచీ నేను మాట్లాడుతున్నది. ఊరికే విషయం చెపుతున్నా అంతే!” అన్నాడు ఆ నిష్కామి!

విశ్వనాథం చాలా తీవ్రంగా “ఒరే అబ్బీ! నామాట విని నీడబ్బు నువ్వు తీసుకో. ఎన్నాళ్లనుంచీ వుంది ఈ అప్పు బకాయిపడి! అడగటానికి నువ్వు బిడియపడిఉండవచ్చు ననుకో, చెల్లించవలసిన బాధ్యత నాకు లేదూ? లేనిపోని రాద్ధాంతం చెయ్యక మెదలకుండా పుచ్చుకో” అంటూ ఆ నోటును కృష్ణమూర్తిమీదికి విసిరివేశాడు విశ్వనాథం.

అంతసేపూ బిగబట్టి నవ్వు ఆపుకుంటున్న శివయ్య ఒక్కసారి పగలబడి నవ్వి “కృష్ణమూర్తీ! నువ్వు మళ్లీ ఆ నోటును విశ్వనాథంమీద విసిరెయ్యరా. ఈ లోపల నేను పోయి బాజాభజంత్రీలని పిల్చుకొస్తాను. మేజువాణీ మజాగా వుంటుంది!” అని విరగబడి నవ్వి ఆ పదిరూపాయల నోటు చేత్తో పుచ్చుకున్నాడు.

శివయ్య నవ్వుతున్నకొద్దీ విశ్వనాథానికి ఒంటినిండా కారం రాసుకున్నట్టుంది.

“ఒరే! నువ్వూరికే అయినదానికీ, కానిదానికీ పూసుకురాబోక. నీసంగతి తెలీందేముంది! సమయాసమయాలు లేకుండా మోటసరసానికి దిగుతావు. కృష్ణమూర్తీ! నామాట విని నువ్వు ఆ పదిరూపాయలూ తీసుకో. అప్పులు తీర్చాలనే ధ్యాస ఉన్నవాడికి డబ్బువిలువ తెలుస్తుంది” అన్నాడు విశ్వనాథం ఎత్తిపొడుపుధోరణిలో.

విశ్వనాథం, కృష్ణమూర్తి అప్పు తీరిందనీ, తీరలేదనీ పోట్లాడుకునే ధోరణిలో ఉన్నారు. అందువల్ల, శివయ్య చేతులో ఉన్న నోటు ఇద్దరిలో ఎవరిదీ కానట్టు ఒకరి మొహం ఒకరు చూచుకుంటూ ఉండిపోయారు. కాని, నోటు మడిచి జేబులో పెట్టుకోవటానికి శివయ్యకు చక్కని అవకాశం కుదిర్చిపెట్టామే అన్నట్టు ఇద్దరూ బిక్కమొహాలతో శివయ్యవైపొకసారి చూశారు. అలాటి సమయంలో, “వచ్చిన తిప్ప లేమిటంటే, ఈమధ్యని ధర్మం ఐదు పాదాలమీద నడుస్తోంది! ఖర్మంకాలి

(23-వ పేజీ చూడండి)



# వ్యర్థాలు

(15-వ పేజీ తరువాయి)

నాకుకూడా ఈడబ్బు అవసరం అట్టే లేకుండా వుంది ప్రస్తుతం. లేకపోతే, ఈ నోటుభారం నేనే భరిద్దును! మీతో చాలా విషయాలు మాట్లాడాలి. ముందు ఈనోటు మీ ఇద్దరిలో ఎవరిదో తేల్చండి త్వరగా," అని శివయ్య అన్నాడంటే వాళ్లిద్దరినీ మరొక పిల్లిమొగ్గ కొట్టించాలని కాకపోతే మరేమిటి?

కృష్ణమూర్తి, విశ్వనాథం ఇద్దరూ తెల్లబోయారు. శివయ్య మాటలధోరణి చూస్తే నిజంగానే కక్కుర్తి అనేదిఇక ఈజీవితంలో ఉండబోదనే ధీమాలో మాట్లాడుతున్నాడు. ఆ నోటు ఇద్దరిలోనూ ఎవరిచేతులో పెడతాడో అన్నట్లు ఎదురుచూస్తున్నారు. ఇద్దరూ నాదంటే నాదని ఆ నోటుని తీసుకోవాలని ఉన్నా శివయ్యతరహా ఎరుగున్నవాళ్లు గనక బయటపడటం మంచిది కాదనుకున్నారు. చివరికి ఆ నోటు విశ్వనాథానికి అందిస్తూ ఇడ్లీ, ఉప్మాతో పెసరట్టు తెమ్మని సర్వరుకి ఒకేసారి పురమాయించి, "మీ రిద్దరూ ఇవ్వాళ్ళ డిన్నరుకి రావాలి. ఇంకా మనవాళ్లంతా చాలామంది వస్తారు" అన్నాడు శివయ్య.

అంతకుపూర్వం ఒకసారి టిఫిన్ పూర్తయినప్పటికీ, శివయ్యచేత కొద్దిపాటి బలవంతం చేయించుకుని హోటల్లో ప్రొద్దుటిపూట తయారయే వస్తువుల్లో చాలాభాగం రుచిచూచారు. స్నేహితులిద్దరిచేత "తృప్తాస్మః" అనిపించి, అయ్యరుకి డిన్నరుపార్టీ పిండివంటల విషయం మరొకసారి జ్ఞాపకంచేస్తూ పదిరూపాయల నోట్లకట్టలోనుంచి ఒక నోటు బయటికి లాగి నిర్లక్ష్యంతో అయ్యరుమొహాన కొట్టి, వాడిచ్చిన చిల్లరలోనుంచి అయిదురూపాయల నోటు వేరుచేసి మిగిలింది జేబులో కుక్కుకుంటూ మూడు స్పెషల్ కిల్లీలతోపాటు ఒక స్టేటెక్స్ప్రెస్ డబ్బాకూడా అందుకున్నాడు!

శివయ్యలో హఠాత్తుగా వచ్చిన ఇంత పెద్ద మార్పుకి కారణమేమిటో అంతుపట్టక విశ్వనాథం, కృష్ణమూర్తి నీకు తెలుసా అంటే, నీకు తెలుసా అనీ, నాకు తెలీదంటే నాకూ తెలీదనీ నేపథ్యంలో కనుబొమలు ఎగరెయ్యటంద్వారా భావప్రకటన ప్రారంభించారు. మరుక్షణంలోనే వాళ్లిద్దరూ కూడబలుక్కున్నట్టు వెళ్లొస్తామనేసరికి శివయ్య వాళ్లిద్దరినీ పట్టుకొని ఆపుచేస్తూ, "ఈ శుభసమయంలో నేనిచ్చే ఆతిథ్యం కాస్త స్వీకరించండర్రో అని మొరపెట్టుకుంటున్నా కాని అంత నిరక్ష్యమేమిటట్రా ఈ దీనుడిమీద?" అంటూ బట్టలదుకాణంలోకి ఈడ్చుకుపోయాడు వాళ్లిద్దరినీ.

"చాల్లేరా తమాషా! ఎందుకొచ్చిన చీదరుపులు... ఇంకాను. అసలు విషయమేమిట్రా!" అన్నాడు కృష్ణమూర్తి ఈర్ష్యను దాచిపెట్టుకుంటూ లోలనగా.

శివయ్య ఈప్రశ్న వినిపించుకోకుండా అవీ ఇవీ బేరంచేసి కొన్నన్ని కొని మెట్లు దిగుతూ, "నెమ్మదిగా చెపుతా! మరి రోజులన్నీ ఒకేమాదిరిగా వుంటయ్యా? ఇట్టా వచ్చింది కాలం!" అన్నాడు.

శివయ్య ఈ మాటలు అని ఊరుకునేసరికి కృష్ణమూర్తి, విశ్వనాథం ఇద్దరిలోనూ ఔత్సుక్యం మరీ వృద్ధయింది. అదేమిటో చెప్పమని ఇంకా బలవంతంచెయ్యటం మొదలుపెట్టారు. చివరికి శివయ్య Illustrated weekly Puzzle First prize తన్నిందిరా!" అన్నాడు. విశ్వనాథం నడుస్తున్నవాడల్లా ఉన్నచోటనే ఉండిపోయి గుడ్లు పత్తికాయలల్లే చేసుకుని శివయ్యముఖంలోకి చూడటం మొదలుపెట్టాడు. కృష్ణమూర్తి క్షణంతరవాత ఒక గుటక మింగి "ఇహ నంతటితో ఆపరా! నిన్ననేగా పజిలు గెల్చిన వాళ్ల పేర్లు announce చేసింది. అందులో నీపేరు తగలడి లేందే!" అన్నాడు.

శివయ్య ఒక నవ్వు నవ్వి, "అది కాకపోతే మరొకటి - R. M D. C ! అదీ కాదంటావా, గిండీరేసెస్! దానికి ఇది సీజన్ కాదనుకుంటే డెర్బీస్వీప్! ఏదో ఈగోత్రానికే చెందిన ఒక నడమంత్రపుసిరి!...." ఇలా నడిచింది శివయ్యధోరణి.

బట్టల దుకాణంనుంచి ఫాన్సీదుకాణం, ఫాన్సీదుకాణంనుంచి పువ్వులదుకాణం, అక్కడినుంచి పళ్ల దుకాణం - ఇలా మార్కెట్టంతా వీరవిహారం చేశాడు శివయ్య ఆపూట. ఇదేదో తమని ఎద్దేవా చెయ్యటానికి శివయ్య పడుతున్న తాపత్రయంలాగా అనిపించింది కృష్ణమూర్తికీ, విశ్వనాథానికీ. మరి అందుకు కాకపోతే శివయ్య అయినవీ, కానివీ వీళ్లకి కూడా కొనటమెందుకు? పైగా, వదుల్చుకు వెళ్ళనివ్వడు! ఆరోజల్లా వాణ్ణి వదుల్చుకు బయటపడటానికే వీలుగాకపోయింది.

ఇంతకంటె అసహ్యకరమైన విషయం - ఇది తరవాత కొన్నిరోజులకి కాని బయటికి రాలేదు. మర్నాడు శివయ్య కృష్ణమూర్తి ఇంటికి పోయి విశ్వనాథం తన బాకీ ఇచ్చిరమ్మన్నాడని పదిరూపాయలు వాడికిచ్చి, తన గడియారం పాడుచేసినదానికి పదిరూపాయలు కృష్ణమూర్తి ఇచ్చిరమ్మన్నాడని విశ్వనాథానికిచ్చి... శివయ్య ఊళ్ళోనుంచి నిష్క్రమించాడు! వాకబు చెయ్యగా ఉద్యోగం బదిలీ అయిందని తేలింది.

* * *

ఇంతకూ శివయ్యకింత డబ్బెక్కడినుంచి వచ్చిందీ తేలనేలేదు.


క్రొత్త డిజైనుల స్టాకు చేరినది

క్రొత్త డిజైనుల స్టాకు. 15 రోజులవరకు గొప్ప తగ్గింపు ధరలు. జ్యూయల్సు కలిగిన వాచీలు 10 సం॥ గ్యారంటీ.



న్యూ స్టయిల్ అలారం ~~36/-~~ 17/-

స్పెషల్ రేడియం ~~42/-~~ 20/8/-

పాకెట్ వాచి ~~30/-~~ 14/-



5 జ్యూయల్సు రేడియం సెంటర్—సెకండ్ ~~72/-~~ 26/-

రైల్వే గార్డవర్ క్రోమియం ~~55/-~~ 24/-

గోల్డు కమాండర్ సుప్రీం ~~66/-~~ 32/-



15 జూయల్సు రెక్టాంగులర్ స్పెషల్ ~~130/-~~ 55/-

ఫ్రేం గోల్డు డీసెంట్ చిన్నది ~~80/-~~ 33/-

పురుషుల పారిస్ షేప్ ~~90/-~~ 41/-



క్రోమియం రేడియం ~~40/-~~ 20/8/-

స్పెషల్ గోల్డు సెకండ్ సిటిల్ ~~52/-~~ 23/8/-

POSTAGE EXTRA, FREE ON TWO.

STANDARD WATCH COMPANY
POST BOX NO. 288. CALCUTTA-1